
ప్రజాశక్తి
గురువారం 6 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం



## 394 మంది గైర్హాజరు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో 34 పరీక్ష కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జనరల్, ఒకేషనల్ విద్యార్థులతో కలిపి 8520 మందికి గాను 8126 మంది హాజరు కాగా, 394 మంది గైర్హాజరైనట్లు డివిఇఒ మంజులవీణ తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు గాని, మాస్ కాపీయింగ్ గాని జరగకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా పర్యవేక్షణ చేసినట్లు తెలిపారు. ఎటువంటి కాపీ సంఘటనలు కూడా జరగలేదని వివరించారు.

# కందిపప్పు కొరత

### మార్చి నెలకు విడుదల కాని వైనం




ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చౌక ధరల దుకాణాల్లో కంది పప్పు కరువైంది. మార్చి నెలకు సంబంధించి ఇప్పటి వరకు విడుదల కాలేదు. దీంతో, కేవలం బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. విజయనగరం జిల్లాలో 5,81,728, పార్వతీపురం మన్యం జిల్లాలో 2,81,279 చొప్పున ఉమ్మడి విజయనగరం జిల్లాలో 8,63,007 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం ప్రతి నెలా తెల్లరేషన్ కార్డులపై బియ్యం ఉచితంగాను, అర కేజీ పంచదార రూ.17, కేజీ కందిపప్పు రూ.78 చొప్పున సబ్సిడీపై పంపిణీ చేస్తున్న సంగతి తెలిసందే. ఇవన్నీ ప్రతి నెలా 1వ తేదీ నాటికే సివిల్ సప్లైయ్ గోడౌన్లకు చేరేవి. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా గ్రామాలకు సరుకులు చేరేవి. వ్యానుల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న విషయం విధితమే. కంది పప్పు విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా 20నుంచి 30శాతం కోత పెడుతోంది. ఈ మేరకు కార్డుదారులకు కంది పప్పు అందడం లేదు. వచ్చిన అరకొర పప్పులోనూ కొంతమేర పక్కదారి పడుతోంది. ఈ సంగతి అటుంచితే ఈనెలకు సంబంధించి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు ఇప్పటికీ కంది పప్పు చేరలేదు. ఏకంగా కందిపప్పు విడుదల చేయకపోవడంతో పేద, నిరుపేదలు నెలలో ఒక్కపూట కూడా పప్పు అన్నం తినే పరిస్థితి లేదు. కేజీ కందిపప్పు ధర బహిరంగ మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ.120 నుంచి రూ.150 వరకు పలుకుతోంది. ఇంతమొత్తం పెట్టి తాము కప్పు కొనుక్కునే పరిస్థితి లేదంటూ పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని సమాచారం. 'నాకు మూడు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు' అని పూసపాటిరేగ మండల కేంద్రానికి చెందిన కె.విజయకుమారి ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మన్యం జిల్లా కురుపాం, సీతానగరం మండల కేంద్రాల్లోని కొందరు రెండు నెలలుగా ఇవ్వలేదని, మరికొందరు మూడు నెలలుగా ఇవ్వలేదని చెప్పారు. దాదాపు అన్ని మండలాల్లోనూ ఈనెల కందిపప్పు ఇవ్వలేదన్న విషయాన్ని కార్డుదారులంతా చెబుతున్నారు.

**ప్రత్యేక సరుకులు ఇక లేనట్టే..!**

గతంలో (2014) టిడిపి అధికారంలో ఉన్నప్పుడు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండగలకు ప్రత్యేకమైన సరుకులు అందేవి. డిసెంబర్, జనవరి నెలల్లో జరిగిన ఈ పండగలకు అటువంటి సరుకులు అందుతాయని భావించినప్పటికీ ఆచరణలో అందలేదు. ఇదే విషయమై పలు సందర్భాల్లో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేదని మంత్రులు చెప్పుకొచ్చారు. ఈసారి నెలవారి ఇచ్చే సరుకుల్లోనూ కందిపప్పు కోత పెట్టడంతో తెల్లరేషన్‌కార్డులు విలవిలాడిపోతున్నారు. ఇలా చౌక ధరల దుకాణాల్లో సరుకులు తగ్గించి, ఇచ్చిన వాటిలో కోత విధించడం, ఈనెల ఏకంగా కందిపప్పు సరఫరాకు ఎగనామం పెట్టడంతో పేదలకు ఆర్థిక భారంగా పరిణమించింది.

### నెలిమర్లలో సరుకులు పక్కదారి

గడిచిన మూడు నెలలుగా సరుకులు సరిగా ఇవ్వడం లేదన్న ప్రజల వాదనకు తగ్గట్టుగానే రేషన్ సరుకులు (బియ్యం, పంచదార, కందిపప్పు) పక్కదారి పట్టాయి. నెల్లిమర్ల మండలం కొండవెలగాడలోని ఓ కిరాణా దుకాణంలో బయటపడ్డ అక్రమ సరుకులు ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఈ దుకాణంలో నాలుగు క్వింటాళ్లు, అర కిలో పంచదార ప్యాకెట్లు 41, కేజీ కందిపప్పు ప్యాకెట్లు 10చొప్పున బయటపడ్డాయి. ఈ మేరకు సిఎస్‌డి ఈ సరుకులు గుర్తించి, కేసు నమోదుచేశారు. ఇటువంటి సంఘటనలు ఉమ్మడి విజయనగరం జిల్లాలో నిత్యకృత్యంగా మారాయి.


ఎండియు వాహనం ద్వారా బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్న సిబ్బంది

### రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు



రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. జనవరిలో మాత్రం ఇచ్చారు. కొంతమందికి ఆ నెల కూడా ఇవ్వలేదు. మార్చి నెలకు సంబంధించిన కందిపప్పు ఇంకా రాలేదని రేషన్ విక్రయించే సిబ్బంది చెబుతున్నారు. పప్పు ధర కూడా పెరిగిపోయింది. రూ.150 పెట్టి కొనుక్కునే పరిస్థితి మాకు లేదు. మాలాంటివారు కందిపప్పు కూడా తినలేని పరిస్థితి ఏర్పడింది.

**- అమరాపు రమణమ్మ, బైరిపురం, మెరకముడిదాం మండలం,**

### ఔను..! కందిపప్పు రాలేదు



ఔను..! ఇప్పటి జిల్లాకు కందిపప్పు రాలేదు. గతంలో 1వ తేదీ నాటికి వచ్చేది. ఒక వేళ ఆలస్యం అయితే సమాచారం ఉండేది. ప్రస్తుతం సమాచారం లేదు. రాగానే సప్లై చేస్తాం.

**- ఎస్.మధుసూదనరావు, డిఎస్ఒ, విజయనగరం జిల్లా**



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు, రైతులు

# రైతు వ్యతిరేక విధానాలు ఆపాలని ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

వ్యవసాయ రంగానికి నష్టం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలు వెనక్కి తీసుకోవాలని రైతు సంఘాల సమన్వయ సమితి నేతలు డిమాండ్ చేశారు. లేదంటే మరోసారి ఢిల్లీ తరహా పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకురాలు పి.రమణి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ మాట్లాడారు. అన్ని పంటలకు పార్లమెంట్‌లో మద్దతు ధరల అమలు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణ మాఫీ చేయాలని, 60 ఏళ్లు నిండిన వారికి నెలకు 10 వేలు పెన్షన్ ఇవ్వాలని, కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తేవాలని కోరారు. విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించి, స్మార్ట్ మీటర్ విధానాన్ని మానుకోవాలన్నారు. ధరల స్థిరీకరణ నిధిని పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టం పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పని దినాలు, వేతనాలు పెంచి, పథకం విస్తరింప చేయాలన్నారు. జీడికి మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ బి.దాసు, రైతు కూలీ సంఘం నాయకులు పి.శ్రీను నాయుడు, యు. ముత్యాలు, ఎం.భాస్కర్ రావు (బాషా), అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు జె.ముత్యాలు, ఎపి రైతు సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరావు, అయ్యార్ల సంఘం నాయకులు ఎస్.ఆదినారాయణ, జి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏనుగుల సమస్య పరిష్కరించండి

### అసెంబ్లీలో ప్రస్తావించిన కురుపాం ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కురుపాం

ఏనుగుల సమస్యతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడారు. ఏనుగుల వల్ల వేలాది ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. ఏనుగుల సంచారంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రాత్రివేళల్లో ఏనుగులు రోడ్లపైకి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఏనుగులు దాడిలో ఎంతోమంది మృతి చెందారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల కాలంలో కుక్కల బెడద ప్రజలను వెంటాడుతోందన్నారు. కుక్కల దాడిలో కూడా మరణించారని ఆవేదన చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.


సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

# పాఠశాలను కలపొద్దు

### విలీనాన్ని వ్యతిరేకించిన విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని రామవరం ప్రాథమిక పాఠశాలను జగ్గునాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌ఎంసి సభ్యులు, గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా బుధవారం రామవరం ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారుల సమక్షంలో తల్లిదండ్రులు, గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఇఒలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాల విలీనం గురించి ప్రస్తావించారు. దీనిని తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించారు. విద్యార్థుల భద్రత పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వం మానుకోవాలని, ప్రతిపాదనను విరమించుకోకపోతే భవిష్యత్తులో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.సత్యం నాయుడు, ప్రధానోపాధ్యాయులు బి. ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మహిళా దినోత్సవ వేడుకలు

### అధికారులకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డిఆర్ఒ హేమలత

ప్రజాశక్తి-పార్వతీపురం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించాలని మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.. జిల్లా అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై కలెక్టర్లు, అధికారులతో బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. సంబంధిత అధికారులంతా సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి వివరించారు.

సమావేశం అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వీలుగా వేదికను సిద్ధం చేయాలన్నారు. ఆహ్వాన పత్రికలను ముద్రించి మంత్రులు, ప్రజాప్రతినిధులను, అధికారులను ఆహ్వానించాలని సూచించారు. ప్రతిఒక్కరికీ ముందస్తు సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. మహిళా పారిశ్రామిక వేత్తలు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన నారీమణులకు సత్కారం చేయాలన్నారు. వేదిక వద్ద వివిధ రకాల స్టాళ్లతోపాటు ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసారాన్ని అందరూ తిలకించేలా డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేయాలన్నారు. మహిళా లబ్దిదారులను గుర్తించి వారికి రుణాలు, బ్యాంకు లింకేజీలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో విద్యార్థులు, మహిళల కోసం చేపడుతున్న కార్యక్రమాలను అందరికీ వివరించాలని చెప్పారు. ముఖ్యంగా అనీమియా నివారణకు జిల్లాలో చేపడుతున్న సప్లిమెంటరీ న్యూట్రీ కిట్లు పంపిణీ, గర్భిణులపై కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధ, విద్యా, వైద్య, నైపుణ్య రంగంలో మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతను అందరికీ అర్థమయ్యేలా తెలియ జేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి టి.కనకదుర్గ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు పథక సంచాలకులు సుధారాణి, వై.సత్యంనాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన రావు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులపై కోర్టు ధిక్కరణ కేసు

### మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

జిల్లా, మండల అధికారులపై కోర్టు ధిక్కరణ కేసు వేయనున్నట్లు మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. పాచిపెంట మండలంలోని గిరిజన సర్పంచులు సోములు లచ్చయ్య, ఎం.సింహాచలంతో కలిసి బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మన్యం జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీరాజ్ శాఖ, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధి హామీ అధికారులు అడ్డదిడ్డంగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. చట్టాలను లెక్కచేయడం లేదని, హైకోర్టు తీర్పులను ఖాతరు చేయడం లేదని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ కింద సిసి రోడ్ల పనులు, పాఠశాల ప్రహరీ గోడ పనులు, గోశాల పనుల విషయంలో అధికారులు చెప్పిందే వేదంలా సాగుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

గిరిజన సర్పంచులను అధికారులు భయపెడుతున్నారని మండిపడ్డారు. సిసి, బిటి రోడ్లు, పాఠశాల ప్రహరీ గోడలు, గోశాల నిర్మాణ పనులు తమకు నచ్చిన వారికే ఇస్తామని, అడగడానికి సర్పంచ్ లెవరని బెదిరిస్తున్నారని చెప్పారు. సర్పంచులకు రాజ్యాంగంలో 73వ సవరణ అండగా ఉందని, కొన్ని హక్కులు, అధికారాలు కల్పించిందని గుర్తుచేశారు. పంచాయతీరాజ్ చట్టం 1994 సెక్షన్ 45 ద్వారా హక్కులు, అధికారాలు వచ్చాయని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం 42/ 2005లోని సెక్షన్ 2లో (జి), పంచాయతీరాజ్ చట్టం 16లో (5) గ్రామీణ ఉపాధి హామీకి సంబంధించిన పనుల విలువలో 50 శాతం గ్రామ పంచాయతీకి కేటాయించాలని ఉందన్నారు. ఇటీవల కొన్ని గ్రామాల్లో సర్పంచులను బేఖాతరు చేస్తూ ఉపాధి హామీ పనులు చేయడంపై హైకోర్టులో కేసులు వేసినట్లు చెప్పారు. అధికారులు ఎంతటి వారైనా చట్టాలకు లోబడి పని చేయాలని సూచించారు. చట్టాలను అతిక్రమిస్తే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని రాజన్నదొర హెచ్చరించారు. ఈ సమావేశంలో పాచిపెంట సీనియర్ నాయకులు చినబాబు పాల్గొన్నారు.

# 5 వేల గృహాలు మంజూరు

### హౌసింగ్ పీడీ రామచంద్రారెడ్డి


రేగులపాడులో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ రామచంద్ర రెడ్డి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో 15 మండలాల్లో పిఎం జన్‌మన్ పథకంలో పిటిజి గిరిజనులకు 5 వేల గృహాలు మంజూరయ్యాయని గృహ నిర్మాణ సంస్థ పీడీ రామచంద్ర రెడ్డి తెలిపారు. ఇవన్నీ నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. గుమ్మలక్ష్మీపురం మన్యంలో బుధవారం పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గృహ నిర్మాణాల పనితీరు ఎలా ఉంది, ఏ మేరకు ఇళ్ల నిర్మాణం జరిగింది, లబ్ధిదారులకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకునేందుకు వచ్చినట్లు చెప్పారు. ఇంటి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిలిచిపోయిన బిసి, ఎస్‌సిల ఇళ్లకు ప్రభుత్వం కొంత నగదు సాయం చేస్తుందన్నారు. జిల్లాలో దాదాపు 18 వేల ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచి పోయాయని, వీటికి ప్రభుత్వం కొంత ఇన్సెంటివ్ ఇవ్వడం ద్వారా పనులు పూర్తి చేయడానికి వీలుంటుందని చెప్పారు. వర్షాకాలం రాకముందే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లెంటల్ స్థాయికి ఇంటి నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నా మని అన్నారు. రెవెన్యూ శాఖ అధికారుల సహకారంతో ఇసుక సరఫరాకు ఆటంకం లేకుండా చూస్తున్నామని తెలిపారు. మండలంలోని రేగలపాడు, అడ్డంగూడ, కన్నయ్య గూడ గ్రామాల్లో పర్యటించి, లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలు జరుగుతున్న తీరు, లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ రెడ్డి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# 23న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపరం టౌన్

పార్వతీపురంలో ఈ నెల 23న క్రిప్టన్ ఫిట్నెస్ క్లబ్ ఆధ్వర్యంలో మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల వాల్‌పోస్టర్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కోరాడ శేఖర్, నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత

### ఎస్‌పి మాధవరెడ్డి


ర్యాలీలో పాల్గొన్న ఎస్‌పి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత, ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ, అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

మహిళలకు, విద్యార్థినులకు రక్షణగా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ఉంటుందని ఎస్‌పి ఎస్.వి.మాధవరెడ్డి తెలిపారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మహిళలు, విద్యార్థులు, అంగన్వాడీ, మహిళా పోలీస్ సిబ్బందితో పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మార్చి ఒకటో తేది నుంచి మహిళా సాధికార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతిపై అవగాహన కల్పించడం, హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను తెలియజేయడం, మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకొని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎలాంటి సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించాలని, మహిళల భద్రత, రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టంచేశారు.

ఎఎస్‌పి అంకిత సురాన మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల గురించి తెలుసుకొని, వాటిని వినియోగించుకోవాలన్నారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టడానికి పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఐసిడిఎస్ అధికారి కనకదుర్గ, పార్వతీపురం టౌన్, రూరల్ సిఐలు మురళీధర్, గోవింద రావు, తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మిడిగెడ్డపై వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని మాదలంగి సమీపంలో ఉన్న గుమ్మిడి గెడ్డపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డికి టిడిపి మండల కన్వీనర్ ఎస్.ఉదయ్ శేఖర్ పాత్రుడు విన్నవించారు. బుధవారం సచివాలయంలో మంత్రిని కలిశారు. గుమ్మిడిగెడ్డ పొంగి ప్రవహిస్తున్నప్పుడు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని మంత్రికి వివరించారు. కురుపాం నుండి మాదలంగికి వెళ్లే రహదారిలో గుమ్మిడిగెడ్డపై లోలెవెల్ వంతెన స్థానంలో హైలెవెల్ వంతెనను నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వవిప్ జగదీశ్వరి లేఖ ఆయనకు అందించినట్లు ఉదయ్‌శేఖర్ తెలిపారు. 2017లో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చేసిన ప్రీ సర్వే, డిజైన్‌ను ఖరారు చేసిన విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

## మద్యం దుకాణాలకు నేడు డ్రా

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

గీత, సొండి కులాలకు కేటాయించిన మద్యం షాపులకు గురువారం డ్రా తీయనున్నారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ స్టేషన్ల పరిధిలో మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తులకు మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ మందిరంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సమక్షంలో డ్రా తీయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులంతా తప్పక హాజరు కావాలని సూచించారు.



అర్ధాంతరంగా వదిలేసిన బోరును చూపిస్తున్న గిరిజనులు

## బోరు వేశారు... ట్యాంకు మరిచారు

**ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్**

వెలగవలస పంచాయతీ పరిధిలోని మొలగవలస గిరిజన గ్రామస్తులు నీటి సౌకర్యం కోసం చేతిపంపుపైనే ఆధారపడుతున్నారు. ఈ విషయాన్ని ఏడాది క్రితం ప్రభుత్వం దృష్టికి స్థానిక సిపిఎం నాయకులు తీసుకెళ్లారు. వారి అభ్యర్థన మేరకు రిగ్గు బోర్ వేశారు. కానీ ఏడాది గడుస్తున్నా ట్యాంకు ఏర్పాటు చేసి, ఇంటింటి కొళాయి కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే గ్రామంలో ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేసి, తాగునీటి సదుపాయం కల్పించాలని నాయకులు పి.రాము, గ్రామస్తులు కోరుతున్నారు.

## డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి

**ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్**

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలని డిఆర్‌డిఎ ఎపిడి సుధారాణి తెలిపారు. పార్వతీపురం మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం గరుగుబిల్లి, కొమరాడ, పార్వతీపురం విఒఎలకు లోకోస్ యాప్‌పై రెండో రోజు శిక్షణ నిర్వహించారు. సంఘాల లావాదేవీలు, అప్పులు, పొదుపుల వివరాలన్నీ ప్రతి సభ్యులు, సంఘాల వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ ప్రక్రియను ఈ నెలాఖరికి పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిపిఎం (ఫైనాన్స్) అప్పారావు, ఎపిఎం ఐబి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - కురుపాం**

ఈ నెల 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కురుపాంలో బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అరకు పార్లమెంట్ ఇన్చార్జి వి.గంగులయ్య.. చలో పిఠాపురం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ సమన్వయకర్త నిమ్మక నిబ్రహం, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జానీ, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాశక్తి-కొమరాడ**

మసిమండ, పూడేసు, పెద్ద శాఖ, కుంతేసు... ఇలా నాలుగు పంచాయతీల గిరిజనులకు దాహార్తి తీర్చేందుకు మాజీ సైనికుడు సబ్బేన సతీష్‌కుమార్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం కూనేరు రైల్వే గేట్ సమీపంలో చిన్న పాక ఏర్పాటు చేసి, తాగునీటిని అందుబాటులో ఉంచారు. కీర్తిశేషులు సబ్బేన లక్ష్మునాయుడు జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



ప్రిన్సిపల్ శ్రీవరంతో మాట్లాడుతున్న ఎయు బృందం

## డిగ్రీ కళాశాల సందర్శన

**ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పర్మినెంట్ ఎఫిలియేషన్ మంజూరు నిమిత్తం బుధవారం ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు కె.వెంకట్రావు, పి.బి పడాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో కళాశాలలోని వివిధ డిపార్ట్మెంట్లను, తరగతి గదులను, ల్యాబ్‌లను, రికార్డులను ప్రొఫెసర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలోనే ఆంధ్ర యూనివర్సిటీ ఉన్నతాధికారులు తమ కళాశాలకు శాశ్వత ఎఫిలియేషన్‌ను మంజూరు చేస్తారని ప్రిన్సిపల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.రామయ్య, ఐక్యూఎసి కోఆర్డినేటర్ కల్పన, శ్రీవాణి, తులసి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సర్వేలు వేగవంతం

**ప్రజాశక్తి-సీతంపేట**

సర్వేలు శరవేగంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్క్ ఫ్రం హోం సర్వే, చిల్డ్రన్ వితౌట్ ఆధార్ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. అసంఘటిత కార్మికులను e-shram వెబ్‌సైట్లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ వేతన దారులు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, రోజువారి కార్మికులు తప్పనిసరిగా కార్మిక శాఖ నుంచి అందులో నమోదు చేయించుకోవడం వల్ల రెండు లక్షల వరకు ప్రమాద బీమా వంటి లబ్ధిపొందుతారని అన్నారు. ఇంటి పనులు త్వరగా పూర్తి చేయాన్నారు. హౌస్ ఓల్డ్ సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు చదువే ఆయుధం

**ప్రజాశక్తి-మక్కువ**

బాలికలకు చదువే ఒక ఆయుధమని ఐసిడిఎస్ పిఒ బి.అనంతలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని కాశీపట్నం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు భవిష్యత్తులో అవకాశాలు, వాటికి చేయాల్సిన కృషి, సాధించాల్సిన ఉద్యోగాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లల కి చదువు అనేది ఒక ఆయుధమని, దాన్ని సరైన పద్ధతిలో వినియోగించుకుని ఉద్యోగాల్లో రాణించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ పి.రాజశ్రీ, మహిళా పోలీస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణులకు సామూహిక సీమంతాలు

**ప్రజాశక్తి - గరుగుబిల్లి**

మండలంలోని పెదగుడబ పంచాయతీ పరిధిలోని సన్యాసిరాజుపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి, పెదగుడబ సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి అంగన్వాడి వర్కర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువులను తూకం వేసి పరిశీలించారు. అనంతరం పిఒ సుగుణ కుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సంబంధించి పోషకాహార లోపం, రక్తహీన తతో బాధపడ కుండా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాలతో కూడిన బలవర్ధకమైన పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





ఆహారం వడ్డిస్తున్న డిఎస్‌పి రాంబాబు, సిఐ చంద్రమౌళి

వైద్య శిబిరానికి హాజరైన గిరిజనులు

# వైద్య శిబిరానికి విశేష స్పందన

**పోలీసు శాఖ ఆధ్వర్యాన వెయ్యి మందికి వైద్య సేవలు ● వృద్ధులకు దుప్పట్లు, గొడుగులు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ**

**ప్రజాశక్తి-సీతంపేట**

మండలంలో మారుమూల గిరిజన ప్రాంతమైన మర్రిపాడులో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మర్రిపాడు, పూతికవలస, పివి ఈతమానుగూడ, కీసరజోడు, చిన్న బగ్గ పంచాయతీల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా రోగులు హాజరయ్యారు. సీతంపేట ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు, సిఐ ఎం.చంద్రమౌళి ప్రారంభించారు.

సీతంపేట ఏరియా ఆసుపత్రి, శ్రీకాకుళం జిలాల రాగోలు జెమ్స్ ఆసుపత్రి, పాలకొండ విజయ ఆసుపత్రి, మర్రిపాడు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు రిఫర్ చేశారు. మిగతా వారికి మందులు అందజేశారు. వచ్చిన వారందరికీ పోలీసులు భోజనాలు ఏర్పాట్లు చేశారు. వృద్ధులకు దుప్పట్లు, గొడుగులు, వాటర్ బాటిళ్లు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, సాయి చరణ్, సత్యవేణి, పివి ఈతమానుగూడ సర్పంచ్ వీరన్న, నాయకులు ఇమరక పవన్, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.



బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న
జిల్లా పౌర సరఫరాల అధికారి రామచంద్ర రెడ్డి

## జిసిసి గోదాం పరిశీలన

**ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం**

గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన సహకార సంస్థ గోదాములను జిల్లా పౌరసరఫరాల ఇన్‌ఛార్జి అధికారి రామచంద్ర రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాములో బియ్యం నిల్వలు పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సమయానికి ప్రజలకు, వసతిగృహాలకు బియ్యం సరఫరా అయ్యేటట్లు చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గోదాం సూపరింటెండెంట్ సాంబశివరావు ఉన్నారు.

# ప్రణాళికతో చదివి ఉత్తీర్ణత సాధించాలి

**ఐటిడిఎ అశుతోష్**



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ అశుతోష్ శ్రీవాత్సవ

**ప్రజాశక్తి-కొమరాడ**

పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ ఆకాంక్షించారు. కొమరాడ మండలంలోని ఎపి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం పిఒ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలంటే పదో తరగతి పునాదని, శ్రద్ధతో విద్యనభ్యశించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం ఇష్టంతో చదివి ఉత్తీర్ణత పొందాలని అభిలాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కోసం వండిన వంటలను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రతి రోజూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతులు లోటు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో వసతిగృహ వార్డెన్, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల సందర్శన

**ప్రజాశక్తి-సీతంపేట**


మండలంలో పూతికవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను, చిన్నబగ్గ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ కె.రవి ప్రసన్నకుమార్ బుధవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడ్డాయని ప్రత్యేక సాధన చేయాలన్నారు. కష్టపడి చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా వివరిస్తుందన్నారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రికార్డులు పరిశీలించారు. మరుగుదొడ్లు, ఆర్ఒ ప్లాంట్ పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిఎంఒ చిరంజీవి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, శారద, డిప్యూటీ వార్డెన్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చిన్నబగ్గలో ఫార్మేటివ్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డిఇఒ ప్రసన్నకుమార్

# నీటిఎద్దడి నివారణకు చర్యలు

**క్రాష్ ప్రోగ్రాం ప్రారంభించిన ఎంపిపి, జెడ్‌పిటిసి**





క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి శ్యామల, జెడ్‌పిటిసి లక్ష్మి

**ప్రజాశక్తి-కొమరాడ**

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపిపి శెట్టి శ్యామల తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ మల్లికార్జున రావు ఆధ్వర్యంలో క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌరునాయుడు , వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఐద్వా నాయకులు రామలక్ష్మి

# సమానత్వం అందని ద్రాక్షే

**ఐద్వా నాయకులు రామలక్ష్మి**


**ప్రజాశక్తి-సీతానగరం**

స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినా మహిళలకు సమానత్వం, సాధికారత పదాలు అందని ద్రాక్షగా మిగిలాయని ఐద్వా నాయకులు వి.రామలక్ష్మి ఆవేదన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన మహిళా సదస్సులో రామలక్ష్మి మాట్లాడారు. ఇప్పటికీ మహిళలు, చిన్నారులపై పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పోరాడి సాధించుకున్న మహిళల హక్కులకు, చట్టాలకు పాలక పార్టీలు తూట్లు పొడుస్తున్నాయని మండిపడ్డారు. మహిళలకు రక్షణగా ఉన్న 490ఎ చట్టాన్ని నిర్వీర్యం చేశారని ఆగ్రహించారు. మహిళా కార్మికులకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించడం లేదని చెప్పారు. మహిళలు సాధికారత సాధించాలనా, సమానత్వం రావాలన్నా ప్రభుత్వ ఆలోచన విధానాలలో మార్పు రావాలన్నారు. మహిళా హక్కులు, చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, వై.శాంతికుమారి, ఎం.సునీత, ఐద్వా నాయకులు రెడ్డి లక్ష్మి, పార్వతి, శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా చూడాలి

**ప్రజాశక్తి-వీరఘట్టం**

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తరచుగా గ్రామాలను సందర్శించాలని సూచించారు. ఎక్కడైనా మంచి నీటి బోర్లు మరమ్మతులకు గురైతే తక్షణమే బాగుచేయించాలని చెప్పారు. ఇంటి పన్నులు వసూలు చేసి, లక్ష్యాలు చేరుకోవాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న వివిధ రకాల సర్వేలు వేగవంతం చేయాలన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన సంపద కేంద్రాల పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి టి.రమణమూర్తి నాయుడు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



మహాధర్నా విజయవంతానికి ప్రచారం చేస్తున్న నాయకులు

# 12న ఉపాధి కూలీల మహాధర్నా

**ప్రజాశక్తి-పాచిపెంట**

ఉపాధి హామీ కూలీల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12న విజయవాడలో చేపట్టే మహా ధర్నా కదలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.రామారావు, కె.దొరబాబు కోరారు. బుధవారం పాచిపెంటలో ఉపాధి హామీ కార్మికులు బండి స్వర్ణలత, జ్యోతి ఆధ్వర్యంలో వారు మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. వీరికి సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి బోను గౌరునాయుడు మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పనిదినాలు, వేసవి అలవెన్స్, పేస్లిప్పులు, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రాంతాల్లో టెంట్లు, మజ్జిగ, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.

## ఎంపిడిఒ కార్యాలయానికి రూ.10 లక్షలతో సిసి రోడ్డు

**ప్రజాశక్తి-వీరఘట్టం**

స్థానిక ఉపాధి హామీ కార్యాలయం నుండి ఎంపిడిఒ కార్యాలయం వరకు రూ.10 లక్షలతో సిసి రహదారి పనులు చేపడుతున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు. మండల పరిషత్తు నిధులతో ఈ పనులు చేయనున్నామని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



ఎంపిడిఒ కార్యాలయ రహదారి ఇదే



ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

## ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్**

ఎపి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం స్థానిక ఎన్‌జిఒ భవనంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎ.తిరుపతిబాబు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. విజయనగరం జిల్లా అధ్యక్షులు కె.ఎన్.అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.శంకరరావు, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కె.వి.వెంకటేశ్వరరావు పరిశీలకుల గా హాజరయ్యారు. సభాధ్యక్షులుగా ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు జివిఆర్‌ఎస్ కిషోర్ వ్యవహరించారు.



కార్యక్రమానికి హాజరైన జనం

## అలరించిన శ్రీరామ పట్టాభిషేకం

**ప్రజాశక్తి-పార్వతీపురం**

పట్టణంలో వికాస తరంగిణి ఆధ్వర్యాన త్రిదండి చినజీయర్ స్వామితో శ్రీరామ పాదుకా పట్టాభిషేకం నిర్వహించారు. సౌందర్య నారాయణమూర్తి నగర్‌లోని ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వికాస తరంగిణి అధ్యక్షులు ఇండుపూరి గున్నేశ్వరరావు సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముస్తాబవుతున్న సమీకృత భవనం

**ప్రజాశక్తి-వీరఘట్టం**

వీరఘట్టంలోని మహిళా సమాఖ్య కార్యాలయం పక్కన సుమారు రూ.రెండు కోట్లతో చేపడుతున్న సమీకృత భవనం ప్రారంభానికి ముస్తాబవుతోంది. గత టిడిపి ప్రభుత్వంలో 2019లో విద్యార్థినులకు సంబంధించి సమీకృత భవన పనులు చేపట్టారు. గత ఐదేళ్ల కాలంలో ఈ భవనానికి నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టరు అర్ధాంతంగా పనులు నిలిపివేశారు. ప్రస్తుతం మరుగుదొడ్ల నిర్మాణం, ప్లాస్టింగ్ చేసిన గోడలకు తెల్ల సున్నం రాయడం వంటి పనులు చేపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కాంట్రాక్టరు తెలిపారు.



వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సిద్ధం చేస్తున్న బాలికల సమీకృత భవనం